కల్వర్టు పనులు తక్షణమే ప్రారంభించాలి

ఎంపీ ఈటల రాజేందర్



సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో పర్యటిస్తున్న ఎంపీ రాజేందర్

జగద్గిరిగుట్ట: షాపూర్‌నగర్ నుంచి జగద్గిరిగుట్ట వెళ్లే పైపులైన్ రోడ్డులో కల్వర్టు పనులను తక్షణమే మొదలపెట్టాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం కురిసిన భారీ వర్షానికి ఈ రోడ్డులో రాకపోకలు స్తంభించాయి. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్ యాదవ్ సమస్యను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం ఎంపీ పరిశీలించి జోనల్ కమిషనర్‌తో మాట్లాడారు. సమస్యను పరిష్కరించేందుకు పనులను మొదలు పెట్టాలన్నారు. కార్యక్రమంలో రావుల శేషగిరి, భరత సింహారెడ్డి, శ్యామ్ కిరణ్, మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యను పరిశీలించిన ఎంపీ

కుత్బుల్లాపూర్: జీడిమెట్ల డివిజన్ సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో నెలకొన్న డ్రైనేజీ సమస్యపై మంగళవారం మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ బీజేపీ నాయకులతో కలిసి పర్యటించారు. కొన్ని రోజులుగా డ్రైనేజీ లైన్ అధ్వానంగా మారడంతో స్థానికంగా తీవ్ర దుర్గంధం వెదజల్లడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ నాయకులు రాజేందర్ దృష్టికి తీసుకువెళ్లారు. సమస్యను పరిశీలించిన ఎంపీ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి, కార్పొరేటర్ రావుల శేషగిరి, అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న భరత సింహారెడ్డి తదితరులు

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోరి షిర్డీ హిల్స్, అంజయ్య నగర్‌లో మంగళవారం రేణుకా ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఘనంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ ఆడెపు నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత సింహారెడ్డి హాజరయ్యారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పున్నారెడ్డి, మహేందర్, హనుమంత్, రమేష్, ప్రవీణ్ గుప్తా, రవి ముప్పడి, తిరుపతి గౌడ్, నార్లకంటి దుర్గయ్య, శ్రవణ్, శివ, శ్యామ్ పాల్గొన్నారు.

పాలకుల చిత్తశుద్ధి లోపంతోనే దాడులు



నిరసన తెలుపుతున్న మహిళా సంఘాల నేతలు

కుత్బుల్లాపూర్: మహిళల కోసం రక్షణ చట్టాలున్నా పాలకుల చిత్తశుద్ధి లోపంతోనే మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు అనురాధ, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి భారతి అన్నారు. కోల్‌కతా ఘటనపై మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు పాలకులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పద్మ, లక్ష్మి, వజ్రమణి, అనసూయ, భారతమ్మ, శోభ, సుగుణ, నాగమణి పాల్గొన్నారు.



మట్టితో నింపిన బంధం చెరువు వద్ద అధికారులు నాటిన మొక్కలు

కబ్జాదారులు మట్టి పోశారు.. అధికారులు మొక్కలు నాటారు

సుభాష్‌నగర్: ఓ కబ్జాదారుడు కొన్ని నెలలుగా చెరువులో 200 గజాల స్థలం మేర మట్టి పోసి ప్లాటుగా మార్చాడు. సదరు స్థలంలో నిర్మాణం చేపడుదామన్న లోపే ఇటీవల జీహెచ్‌ఎంసీ అధికారులు మొక్కలు నాటారు. గాజులరామారం నుంచి లాల్‌సాహెబ్ గూడకు వెళ్లే రోడ్డును ఆనుకుని సర్వే నెంబర్ 468లో 12 ఎకరాల 20 గుంటల విస్తీర్ణంలో బంధం చెరువు ఉంది. ఇప్పటికే 5 ఎకరాల మేర చెరువు కబ్జాకు గురైంది. మిగిలి ఉన్న స్థలాన్ని కాజేసేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు మొక్కలు నాటి వారి ప్రయత్నానికి చెక్‌పెట్టారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి



రాజీవ్ గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: మాజీ ప్రధాని, దివంగత నేత రాజీవ్‌గాంధీ జయంతిని మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివి ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాజులరామారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ నివాళి అర్పించారు. టెలికాం, కంప్యూటరైజేషన్ రంగాల్లో రాజీవ్ గాంధీ విశేష కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, నిజాంపేట్ కార్పొరేటర్ ఏనుగు శ్రీనివాస్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ పాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కొంపల్లిలో కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు బైరి ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.



కొంపల్లిలో నివాళులర్పిస్తున్న ప్రశాంత్‌గౌడ్, కార్యకర్తలు

జగద్గిరిగుట్ట: రాజీవ్ గాంధీ సేవలు మరువలేనివి అని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఐలయ్యగౌడ్ అన్నారు. జగద్గిరిగుట్టలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనార్దన్, గూడ సాయి ప్రవీణ్ గౌడ్, యాదగిరి ఎల్లమ్మ, శరత్ పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా సహకారం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్: కాలనీ అభివృద్ధికి ఎల్లవేళలా సహకరిస్తానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇటీవల శ్రీ వివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన బొల్లు శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కమ్యూనిటీ హాల్‌ను ప్రజలు శుభకార్యాలకు వినియోగించుకోవచ్చని, అదే విధంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుతానని అన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కార్పొరేటర్ సబిహా బేగం మాట్లాడుతూ.. గెలుపోటములతో నిమిత్తం లేకుండా అందరు కలిసి కాలనీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సమస్యల పరిష్కారానికి తనవంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, కోఆర్డినేటర్ వీరారెడ్డి, నాయకులు తుంగం శ్రీనివాసరావు, రోణంకి జగన్నాథం, గుత్తికొండ రామకృష్ణ, యాదవ్‌రెడ్డి, దేవరింటి మస్తాన్ రెడ్డి, సూరిబాబు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

లోతట్టు ప్రాంతాలు జలమయం

• ఇళ్లల్లోకి చేరిన వరద నీరు • ప్రజలు, వాహనదారులకు తిప్పలు • నీరు సాఫీగా వెళ్లేలా అధికారుల చర్యలు



గండిమైసమ్మ చౌరస్తాలో నిలిచిన వరదనీటిని బయటకు పంపేందుకు క్రేన్‌తో అడ్డంకులను తొలగిస్తున్న సిబ్బంది

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు వర్షం కురవడంతో పలు రోడ్లలో మోకాళ్ల లోతు వరదనీరు చేరింది. ఇళ్లల్లోకి వరద చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆయా ప్రాంతాల్లో డ్రెయినేజీలు, మ్యాన్‌హోళ్లను తెరిచి వరదనీరు సాఫీగా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. మరో రెండు రోజుల పాటు ఇదే విధంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు పేర్కొనడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

– కుత్బుల్లాపూర్



రావినారాయణరెడ్డినగర్‌లో కాలనీలో నిలిచిన వరదనీరు



చింతల్ మార్కెట్ రోడ్డులోని నందిని మెడికల్ దుకాణం ఎదుట మ్యాన్‌హోల్‌ను తెరిచిన సిబ్బంది



వెంకన్న హిల్స్ కాలనీలో ఇండ్ల మధ్య వరదనీరు



జీడిమెట్ల 44వ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో నిలిచిన వరదనీరు



జీడిమెట్ల పారిశ్రామికవాడలోని విర్కో పరిశ్రమ వద్ద నిలిచిన వరదనీరు

కార్మికులకు జీతాలు ఇప్పించిన నేత



కుత్బుల్లాపూర్: కార్మికుల న్యాయమైన హక్కుల కోసం నిరంతరం పోరాడుతానని కార్మిక నాయకుడు, శ్రమశక్తి అవార్డు గ్రహీత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. జీడిమెట్ల పారిశ్రామికవాడలోని బాలాజీ స్పోర్ట్స్ డ్రెస్సెస్ కంపెనీలో 22 మంది మహిళా కార్మికులు పని చేస్తున్నారు. ఇటీవల పరిశ్రమ యాజమాన్యం కంపెనీని మూసివేసింది. యాజమాన్యం కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదు. కార్మికులు మదన్‌గౌడ్‌ను ఆశ్రయించడంతో యాజమాన్యంతో మాట్లాడి 60 శాతం జీతాన్ని ఇప్పించారు. మరో రెండు నెలల్లో మిగిలిన జీతాన్ని ఇప్పించే విధంగా ఒప్పందం కుదిర్చారు. కార్యక్రమంలో కె. సుభాష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

బస్సులో బంగారు గొలుసు చోరీ

మూసాపేట: ఆర్టీసీ బస్సులో ఓ మహిళ మెడలో నుంచి మంగళసూత్రం, చైన్ చోరీ అయిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బౌరంపేట ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న శ్వేత (35) అమీర్‌పేటలో సాఫ్ట్‌వేర్ కోచింగ్ తీసుకుంటుంది. మంగళవారం అమీర్‌పేట నుంచి కేపీహెచ్‌బీకి బస్‌లో వెళ్తుంది. కూకట్‌పల్లి వై జంక్షన్‌కు వచ్చాక చూసుకుంటే మెడలో సుమారు 3 తులాల మంగళసూత్రం, బంగారం చైన్ కనిపించకపోవటంతో దొంగతనం జరిగిందని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాదుల నిరసన



కూకట్‌పల్లి: అడ్వకేట్ జేఏసీ పిలుపు మేరకు కూకట్‌పల్లి న్యాయవాదులు విధులను మంగళవారం బహిష్కరించారు. న్యాయవాది సంతోష్‌ను అక్రమంగా బోరబండ పోలీస్ స్టేషన్‌కు తరలించినందుకు ఎస్ఐ జమీల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ అంతరాయాన్ని నిరసిస్తూ ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న కాలనీల అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్: విద్యుత్ అంతరాయాలను నిరసిస్తూ మంగళవారం జీడిమెట్ల డివిజన్ పరిధిలోని పలు కాలనీల అసోసియేషన్ సభ్యులు వెన్నెలగడ్డలోని ఈఆర్‌ఓ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు నెలలుగా సాయిబాబానగర్ ఫీడర్ పరిధిలో రాత్రి, పగలు తేడా లేకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అనంతరం డీఈ శ్రీనాథ్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎం.ఎస్.రెడ్డి కాలనీ ఫేస్-1 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సంపత్ గౌడ్, బ్యాంక్ కాలనీ అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, న్యూ వివేకానంద నగర్ మాజీ ప్రెసిడెంట్ సత్తయ్య గౌడ్, ఎల్లాగౌడ్, బలరాం, పరమేష్, బాలరాజ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మించారు.. సీసీ రోడ్డు మరిచారు

నిజాంపేట్: అధికారుల అలసత్వంతో ఆ గల్లీల ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. భూగర్భ డ్రైనేజీ లైన్ పూర్తిచేసి సీసీ రోడ్డు వేయకపోవడంతో వర్షం పడ్డ ప్రతిసారి మట్టి పేరుకుపోవడంతో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నిజాంపేట్ కార్పొరేషన్ 5వ వార్డులోని ఇంటి నెంబరు 1068 నుంచి 1077 వరకు, అదే విధంగా 1078 నుంచి ఇళ్ల మధ్యలో మార్చి నెలలో డ్రైనేజీ లైన్ పనులు ప్రారంభించి మే నెలలో పూర్తి చేశారు. సదరు కాంట్రాక్టర్ మట్టిని తొలగించకపోవడంతో ఇటీవల కురిసిన వర్షానికి బురదమయంగా మారింది. ఈ విషయమై స్థానికులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా.. తూతూ మంత్రంగా మట్టిని తొలగించి చేతులు దులుపుకున్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పైప్రాంతాల నుంచి మట్టి కొట్టుకురావడంతో ద్విచక్ర వాహనదారులు జారి పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల స్పందించి సీసీ వేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికుల కోరుతున్నారు.



నిజాంపేట్ 5వ వార్డులోని గల్లీలో బురదమయంగా మారిన దారి

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యేను కలిసిన సంక్షేమ సంఘాల నేతలు

కుత్బుల్లాపూర్ : ప్రజా సమస్యల పరిష్కారానికి తాను ఎప్పుడూ ముందుంటానని, సంక్షేమ సంఘాలు కాలనీ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే వివేకానంద్ గౌడ్ అన్నారు. మంగళవారం ఆయన నివాసంలో పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు, నాయకులు, ప్రజలు వచ్చి వినతిపత్రాలు సమర్పించారు. వెంటనే స్పందించిన ఆయన అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీ, నిజాంపేట్ కార్పొరేషన్‌లతోపాటు జంట సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. పలు దేవాలయాల కార్యక్రమాలకు హాజరుకావాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు చెక్కులనందజేస్తున్న గౌరీష్

కుత్బుల్లాపూర్: చింతల్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో 235 మంది లబ్ధిదారులకు రూ.95.30 లక్షల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ కార్పొరేటర్ కేఎం గౌరీష్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అర్హులైన ప్రతి ఒక్కరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, వివిధ డివిజన్ల బీఆర్‌ఎస్ అధ్యక్షులు ఎర్వ శంకరయ్య, రుద్ర అశోక్, పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, సీనియర్ నాయకులు కమలాకర్, గుబ్బాల లక్ష్మీనారాయణ, మహేష్, ప్రసాద్ పాల్గొన్నారు.

'ఎకో సెంట్రిక్ పార్కు' పనులు

ఎన్నాళ్లు ?



నల్లగండ్ల హుడా కాలనీలో ఏర్పాటవుతున్న ఎకో సెంట్రిక్ పార్కు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్‌లోని నల్లగండ్ల హుడాకాలనీలో నాలుగు ఎకరాల్లో 'ఎకో సెంట్రిక్ పార్కు' పేరిట రూ.2.60 కోట్ల వ్యయంతో నవంబర్ 5 తేదీ 2022లో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తదితరులు పనులకు శంకుస్థాపన చేశారు. అయితే రెండేళ్లయినా అవి పూర్తి కావడం లేదు. ఈ పార్కులో ఇప్పటి వరకు సివిల్‌వర్క్‌లో భాగంగా 80 శాతం పనులు పూర్తి చేశారు. మిగతా 20 శాతం పనులకు నిధుల విడుదలలో జాప్యం పార్కుపై ప్రభావం చూపుతోంది. పార్కులో సైకిల్ ట్రాక్, వాకింగ్ ట్రాక్ ఓపెన్ ఎయిర్ థియేటర్ పనులు దాదాపు చివరి దశలో ఉన్నాయి. పరగోలాస్, టాయిలెట్స్ నిర్మాణ దశలో ఉన్నాయి. పార్కు ఆర్చి నిర్మాణ పనులు ఇంకా మొదలు కాలేదు. ఎకో సెంట్రిక్ పార్కు నిర్మాణం చేస్తున్న రోజుల్లోనే స్థానికులంతా కలిసి దీనికి 'విశ్వామిత్ర పార్కు' గా నామకరణం కూడా చేసుకున్నారు. పార్కు ఏర్పాటు కోసం కేటాయించిన స్థలంలో ఉన్న సహజసిద్ధంగా ఉన్న భారీ బండరాళ్లను తొలగించకుండా అలాగే ఉంచేలా ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రాతి సంపదను కొనసాగిస్తూనే పార్కును రాక్‌జోన్‌గా ఏర్పాటు చేయాలని పేర్కొంటున్నారు.

నిధుల విడుదలలో జాప్యం



పార్కులో నిర్మిస్తున్న వాకింగ్, సైకిల్‌ట్రాక్



థీమ్ పార్కు ఆర్చి నిర్మించాల్సింది ఇక్కడే..



పార్కులో నిర్మిస్తున్న పరగోల